## క్లుప్తంగా

### వైభవంగా ఉష్ట్రవిగ్రహ ప్రతిష్ట

**ఫిరంగిపురం:** మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఉష్ట్ర(ఒంటె)విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలోని ముఖమండపం వద్ద రుత్విక్కులు దీవి పవన్‌కుమార్, హనుమాచార్యులు, వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అంకురారోహనం, వాస్తుపూజ, వాస్తుహోమం, యంత్ర ప్రతిష్ట పూజ, యంత్రస్నపన కార్యక్రమాలు నిర్వహించారు. ఉష్ట్ర(ఒంటె) విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి అర్చకులు ప్రసన్నమూర్తి నాగవల్లీదళార్చనలు చేశారు. అనంతరం స్వామికి ఎదురుగా ఉష్ట్ర(ఒంటె)విగ్రహ ప్రతిష్ట చేశారు. పూజల్లో పాలపాటి రామకృష్ణ, వై.కాశీ అమర్నాథ్, వై.లక్ష్మయ్య దంపతులు పాల్గొని భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు



**తాడేపల్లి రూరల్(దుగ్గిరాల):** దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడి వద్ద చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయపడ్డారు. దుగ్గిరాల ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాలు.. తాడేపల్లి రూరల్ పరిధిలోని పెనుమాకకు చెందిన రావిశెట్టి సత్యనారాయణ, శివపార్వతి దంపతులు ద్విచక్ర వాహనంపై తెనాలి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో తుమ్మపూడి వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ద్విచక్రవాహనంపై దంపతులు కిందపడ్డారు. 108 మంగళగిరిలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

### గ్రామాల్లో ఫీవర్ సర్వే తప్పనిసరి

**ఫిరంగిపురం:** మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నుంచి పదిరోజుల పాటు వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దాసరి అనూరాధ సోమవారం తెలిపారు. ఇటీవల విస్తరిస్తున్న హెచ్3ఫోర్2 వైరస్ లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. సర్వేకు ఆయాగ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

### మైనార్టీల సంక్షేమానికి కృషి



**ఫిరంగిపురం:** మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ హబీబుల్లా అన్నారు. మండలంలోని వేములూరిపాడులో సోమవారం నిర్వహించిన అభినంద సభలో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నియమించడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. పార్టీని మరింతగా బలోపేతం చేస్తానని చెప్పారు. అనంతరం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలనుండి వచ్చిన మైనార్టీనాయకులు శాలువా, పూలమాలలతో హబీబుల్లాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు షేక్ అబ్దుల్ గఫార్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ జిలానీ, మైనార్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కలీఫ్ మస్తాన్, తుళ్లూరు మండల అధ్యక్షుడు రహమాన్, బాషా, జానిబాషా, ఖాజావలి, సుభాని, షరీఫ్, జి.మస్తాన్‌వలి, సుభాని, మస్తాన్‌వలి, ఖాసిం, కరిముల్లా, గాంధీబుడే పాల్గొన్నారు.

### కార్మిక, కర్షక ర్యాలీని జయప్రదం చేయండి

**తాడేపల్లి రూరల్:** కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న కార్మిక, కర్షక ర్యాలీని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం మసీదు సెంటర్‌లో సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం నరేంద్ర మోదీ నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై అధిక భారాలు వేసిందని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచిందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలు అన్నింటిని ప్రైవేటు పరం చేసేందుకు పూనుకుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బి.గోపిరెడ్డి, వడ్డేశ్వరం బాబూరావు, పున్నయ్య, మాజీ సర్పంచి వి.భిక్షాలు, వి.మరియదాసు, జి.ప్రభుదాసు పాల్గొన్నారు.

# ఆలయ ఆస్తుల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

**రూ.7.28 కోట్లతో అభివృద్ధి పనులు**

**మంగళగిరి:** నగరంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ఆస్తుల పరిరక్షణకు అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఆలయ స్థలాల రక్షణకు రూ.7.28 కోట్లతో చేపట్టిన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. దక్షిణ గాలిగోపురం వైపు నున్న పురాతన ప్రహరీ 2021 ఆగస్టులో కుప్పకూలింది. దీని వల్ల పక్కనున్న ప్రసాదాల తయారీ పోటు దెబ్బతింది. శిథిలాలు తొలగించి ప్రహరీ నిర్మాణాన్ని పూర్తి చేశారు. రూ.60లక్షలు వెచ్చించి ప్రహరీ నిర్మించారు. పరిరక్షణకు రూ.7.28 కోట్లు వెచ్చించి పనులు చేపట్టారు. రూ.1.50 కోట్లతో పెదకోనేరు అభివృద్ధి పనులు చేపట్టి ఇప్పటికే కోనేరులో నీటిని బయటకు తరలించారు. నగర పరిధిలోని ఆత్మకూరు 16 వ నెంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న నాలుగు కాళ్ల మండపం స్థలం లీజు రద్దు చేసి దాని చుట్టూ రూ.40లక్షలతో ప్రహరీ నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. అదే స్థలానికి ఎదురుగా ఉన్న 36 సెంట్ల తులసివనం స్థలానికి రూ.20 లక్షలతో ప్రహరీ నిర్మించారు. ఇక్కడ ఆక్రమణకు గురయిన స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. నగరంలో రాజీవ్ గృహకల్ప రోడ్డు కూరగాయల మార్కెట్ పక్కనున్న దేవస్థానానికి చెందిన కోట్ల విలువైన 3.50 ఎకరాల భూమి దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉంది. నగరం నడిబొడ్డున ఉన్నా ఆలయానికి ఒక్క రూపాయి ఆదాయం సమకూరడం లేదు. గోశాల ఏర్పాటుకు ఆరు సంవత్సరాల కిందట షెడ్డు నిర్మించారు. పక్కన స్వామి వారి పూజలకు కావాల్సిన పూల మొక్కలు, తులసి వలన పెంచాలని ప్రతిపాదించినా ప్రయత్నం ముందుకు సాగలేదు. ఇటీవల ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) స్థలాన్ని పరిశీలించి స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టి స్వామి వారి పూజలకు అవసరమైన పూల మొక్కలు, తులసివనం పెంచాలని అధికారులకు సూచించారు. వెంటనే అధికారులు రూ.60లక్షలతో ప్రహరీ నిర్మాణం, రూ.36 లక్షలతో మట్టితోలకం, మరో రూ.60లక్షలతో రాజీవ్‌గృహ కల్ప వెంట షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. కొండపైన పానకాల స్వామిని దర్శించుకునేందుకు వెళ్లే ఘాట్ రోడ్డును రూ 11లక్షలతో మొక్కలు పెంచి భక్తులకు పచ్చదనంతో కూడిన ఆహ్లాదాన్ని అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.



మన్నెం వారివీధిలోని ఆలయ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు

**దాతల సహకారంతో...**

దాతల సహకారంతో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో స్వామి గర్భాలయాన్ని బంగారు తాపడం ఏర్పాటుకు 36 కిలోల బంగారంతో త్వరలోనే పనులు చేపట్టనున్నారు. రూ.80 లక్షలతో అన్నదాన మండపం, రూ.75 లక్షలతో కొట్టాయం మందిరం, రూ.కోటితో గండాలయ స్వామి గుడి నిర్మాణాలు కొనసాగుతుండగా కొండపై భక్తుల కొరకు దాతలు రూ.36లక్షలతో చేపట్టిన షెడ్డు నిర్మాణం పూర్తి చేసుకోగా ఎమ్మెల్యే ఆర్కే ప్రారంభించి ఆలయ అభివృద్ధి మరింత మంది దాతలు ముందుకు వచ్చి సహకరిస్తే మంగళగిరి- తాడేపల్లి నగరాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి చేయవచ్చని ఆకాంక్షించారు.

**అభివృద్ధికి చర్యలు**



ఆలయ ఆస్తులను పరిరక్షించడంతో పాటు ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే నగరంలోని ఆలయానికి చెందిన స్థలాల చుట్టూ ప్రహరీ నిర్మించడం జరిగింది. దాతల సహకారంతో కోట్ల రూపాయల అభివృద్ధి పనులు సాగుతున్నాయి. ఆలయ ఆస్తుల పరిరక్షణతో పాటు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తచేసి భక్తులకు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఏ రామకోటిరెడ్డి
ఈఓ, లక్ష్మీనృసింహస్వామి ఆలయం

# ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

- పార్టీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్
- యర్రగుంట్లపాడులో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ ఫలాలు గురించి వివరిస్తున్న నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

**ఫిరంగిపురం:** రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని యర్రగుంట్లపాడులో గడప గడపకు మన ప్రభుత్వం సోమవారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా వారికి అందిన లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, సర్పంచి టి.కేశవరావు, మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, పి.మరియబాబు, చల్లా యోగిరెడ్డి, చల్లా వెంకటరెడ్డి, బి.జయరామిరెడ్డి, సాంబిరెడ్డి, బి.శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి, ప్రతాపరెడ్డి తహసీల్దార్ పద్మనాభుడు, ఎంపీడీఓ డి.అనూరాధ, ఈఓపీఆర్డీ నిర్మలలక్ష్మి, ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

# పేదలకు ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సాయం



పెదవడ్లపూడిలో ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న పార్టీ నాయకులు

**మంగళగిరి:** అనారోగ్యంతో ఉన్న పెదవడ్లపూడికి చెందిన మందపాటి సుధీర్‌కు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అందజేసిన రూ.10 వేలను వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, నాయకులు సోమవారం అందజేశారు. చెట్ల కటింగ్ మిషన్‌తో చెట్లు నరుకుతుండగా మెషిన్ రివర్స్ అయి సుధీర్ కాళ్ల మీద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్పందిన ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందజేశారు. అదే విధంగా నగరంలోని ఆటోనగర్‌లోని టిడ్కో ఇళ్లలో నివసిస్తున్న వెల్లంకి నాగఫణీంద్రరావు, కామేశ్వరి దంపతులు పేదరికంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఆర్కే రూ.10వేల విలువైన నిత్యావసరకులు అందించారు. కార్యక్రమంలో మునగాల మల్లేశ్వరరావు, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు సంకె సునీత ఉన్నారు.

**దుగ్గిరాల మండలంలో..**

**తాడేపల్లి రూరల్:** దుగ్గిరాల మండల పరిధిలోని బాధితులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అండగా నిలుస్తూ ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నారు. దుగ్గిరాలలోని మేడిబోయిన నారాయణరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మృతుడి కుటుంబానికి రూ.20,000 ఎమ్మెల్యే తరుపున సోమవారం అందించారు. భవన నిర్మాణ కార్మికుడు ఆత్మకూరి శ్రీనివాసరావు కుటుంబానికి రూ.25 వేలు, అందించారు. కార్యక్రమంలో దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ నాయకులు దానబోయిన వెంకటేశ్వరరావు, ఉప సర్పంచి గాలం ఫణీంద్ర, నాయకులు కంభంపాటి క్రాంతికుమార్, తాడిబోయిన వెంకటరావు, ఆత్మకూరి నాగేశ్వరరావు, జంపాల శివకృష్ణ, బచ్చా రఘునాథ్ యాదవ్, కర్యూరావు పాల్గొన్నారు.

**చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత**

**తాడేపల్లి రూరల్:** చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సాయంతో తోపుడు బండ్లు అందజేశారు. దుగ్గిరాల మండల పరిధిలోని మోరంపూడి గ్రామానికి చెందిన బండపల్లి మాణిక్యం, శ్రీమతి పాములు చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి కోసం ఎమ్మెల్యే అందజేసిన తోపుడు బండ్లను సోమవారం దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, మోరంపూడి ఎంపీటీసీ కూచిపూడి సురేష్, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచి మల్లేశ్వరి, ఇత్తడి చంటి, చలంచర్ల రామకోటిరెడ్డి, దాసు పాల్గొన్నారు.

# 113 తాళ్లూరులో ఉర్దూ పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఉర్దూ డీఐఎం డి.ఖాసిం

**ఫిరంగిపురం:** మండలంలోని 113తాళ్లూరు గ్రామంలోని ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ డీఐఎం డి.ఖాసిం సోమవారం తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల హాజరు పట్టిక, పలు రికార్డులు పరిశీలించారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల సామర్థ్యలు పరీక్షించారు. ఉపాధ్యాయులు వారికి నేర్పించిన ఆంగ్ల పదాలు, గణితం, సాంఘిక శాస్త్రంలోని పలు పాఠాల అంశాలపై విద్యార్థులను ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోగా పాఠ్యంశాల బోధన పూర్తి అయ్యేలా చూడాలన్నారు. త్వరలో వేసవికి ఎండలు ఎక్కువగా ఉండటంతో విద్యార్థులకు అవసరమైన స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని తగిన జాగ్రత్తలు పాటించేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆయనతో పాటు ఉపాధ్యాయులు ఫతాన్ జఫరుల్లాఖాన్, సయ్యద్ మొహిద్దీన్ ఉన్నారు.

# పది పరీక్షలలో ఉన్నత ఫలితాలు సాధించాలి

**ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి**



ఎంఈఓలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

**తాడికొండ:** పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఎంఈఓలు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. సోమవారం గుంటూరులోని తన కార్యాలయంలో ఎంఈఓలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పది విద్యార్థులకు ప్రత్యేక అదనపు తరగతులు నిర్వహించడంతో పాటు చదువులో వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకొని సబ్జెక్టు టీచర్లు హెచ్‌ఎంలతో కలిసి సమన్వయంతో పనిచేస్తే అనుకున్న ఫలితాలు సాధించడం సులభమే అన్నారు. పిల్లల చదువు విషయంలో తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకొనేలా అవగాహన కల్పించాలని సూచించారు. నాడు- నేడు పనుల నిర్వహణపై ఆరా తీసిన ఆమె షెడ్యూల్ ప్రకారం సత్వరమే కొనసాగించి గోడలపై అందమైన వాల్ పెయింటింగ్స్, బొమ్మలు వేయాలని, విద్యార్థులను ఆకట్టుకునేలా పాఠశాలలు తీర్చిదిద్దాలని సూచించారు.

### మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

**తెనాలి:** క్యాన్సర్ రహిత తెనాలి కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం పినపాడులోని కమ్యూనిటీ హాలులో జరిగింది. సోమవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రోత్సాహంతో మున్సిపాలిటీ సహకారంతో శారదా సర్వీస్ సొసైటీ వార్డుల వారీగా మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం 21, 22, 23, 24, 25, 26 వార్డుల పరిధిలోని మహిళలకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో అవగాహన, వర్క్‌షాపు, జనరల్ ఎగ్జామినేషన్, రొమ్ము పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ పరీక్షలతో క్యాన్సర్‌ను ముందుగానే కనుగొని నివారించే అవకాశం ఉంటుందని శారదా సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద వెల్లడించారు.

### ఐటీఐలో స్వల్పకాలిక శిక్షణ కోర్సులు

**తెనాలి:** ఉపాధి అవకాశాలు కలిగిన స్వల్పకాలిక కోర్సులను ప్రారంభించినట్లు తెనాలిలోని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ సీహెచ్ఎస్‌వీ ప్రసాద్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన సౌజన్యంతో ఉపాధి అవకాశాలున్న లైన్‌మెన్ డిస్ట్రిబ్యూషన్, ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, ఫిట్టర్ ఫాబ్రికేషన్, ఎలక్ట్రికల్ వెహికల్ చార్జింగ్ టెక్నీషియన్ కోర్సులు తెనాలి ఐటీఐలో ఉన్నాయని తెలిపారు. మూడు నెలల కాల పరిధి కలిగిన ఈ కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండి, పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత గల ఒరిజిల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

### మంగళగిరి- తెనాలి రోడ్డుకు మరమ్మతులు



**తాడేపల్లి రూరల్:** దుగ్గిరాల మండల పరిధిలోని మోరంపూడి నుంచి రేవేంద్రపాడు వరకు ఉన్న రహదారికి మరమ్మతులు ఆర్ అండ్ బీ అధికారులు సోమవారం చేపట్టారు. మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి సూచన మేరకు మోరంపూడి- రేవేంద్రపాడు వద్ద సుమారు రూ.25 లక్షలతో దెబ్బదిన్న రహదారికి మరమ్మతులు నిర్వహించి మెటల్ సీల్ సర్ఫేస్ టాప్ లేయర్ పనులను నిర్వహిస్తున్నారు.

# నులి పురుగుల నివారణతో ఆరోగ్య పరిరక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కీర్తి

**గుంటూరు ఎడ్యుకేషన్:** విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసమే ప్రభుత్వం నులిపురుగుల నివారణ కోసం ఉచితంగా మాత్రలు పంపిణీ చేస్తోందని ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి జి.కీర్తి పేర్కొన్నారు. చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో సోమవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 14న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చేపడుతున్న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాక్టర్ కీర్తి మాట్లాడుతూ చేతుల ద్వారా ఎన్నో క్రిములు శరీరంలోకి ప్రవేశిస్తాయని, తద్వారా అనారోగ్యం బారిన పడతామని తెలిపారు. మంచి అలవాట్ల ద్వారా రోగాల బారిన పడకుండా సురక్షితంగా ఉండవచ్చని విద్యార్థులకు సూచించారు. వ్యక్తిగత శుభ్రత, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండటం ద్వారా నులి పురుగుల్ని నివారించవచ్చని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రతి ఆర్నెల్లకోసారి నులి పురుగుల నివారణ మాత్రల్ని పంపిణీ చేస్తోందని పేర్కొన్నారు. మెయిన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కృష్ణకిశోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి

**పాత గుంటూరు:** నాలుగో డివిజన్ కుమ్మరి బజార్‌లో తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, కార్పొరేటర్ షేక్ మహమూద్, టిడ్కో డైరెక్టర్ కానూరి నాగేశ్వరి పాల్గొని, మొల్లమాంబ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వరికల్లు శ్రీనివాసరావు, గోపాలరావు, వరికల్లు శ్రీనివాసరావు, ఆంజనేయులు, భూలక్ష్మమ్మ పాల్గొన్నారు.

### నేడు వెలగపూడిలో గడపగడపకు మన ప్రభుత్వం

**తాడికొండ:** తుళ్ళూరు మండలం వెలగపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

### 21న బార్ అసోసియేషన్ ఎన్నికలు

**రేపల్లె:** బార్ అసోసియేషన్ ఎలక్షన్ ఆఫీసర్‌గా జి.ప్రశాంత్‌కుమార్ సోమవారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బార్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా కృషి చేస్తామన్నారు. ఈ నెల 15 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. 15, 16 తేదీల్లో నామినేషన్ ప్రక్రియ, 17న పరిశీలన, నామినేషన్‌ల ఉప సంహరణ, 21న ఎలక్షన్, సాయంత్రం ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు.

### సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

**ఐలవరం(భట్టిప్రోలు):** మండలంలోని ఐలవరంలో సోమవారం సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు పీఎండీఎస్‌పై వివరించి, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. విత్తనాలకు ఘన జీవామృతం, పాడి బంకమన్ను, ఎలిబూడిద కలిపి విత్తన గుళికలు తయారు చేయించారు. సబ్ డివిజన్ యాంకర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తొలకరికి ముందు ఇవి భూమిలో చల్లితే వర్షాలకు మొలకలు వచ్చి, పచ్చిరొట్ట ఎరువుగా మారుతుందన్నారు. ఈ మొక్కలు 45 రోజుల తరువాత భూమిలో కలియదున్నితే సారవంతమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంసీఏ పాండు రంగారావు, ఎల్ 2 సురేష్, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

**భట్టిప్రోలు:** అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భట్టిప్రోలు ఎస్ఐ వై.సురేష్ వివరాల మేరకు.. జువ్వలపాలెం నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను వేమూరు సీఐ కె. వెంకటేశ్వరరావు వెల్లటూరు వద్ద ఆపి వివరాలు అడిగారు. ఎటువంటి టోకెన్లు లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# బొమ్మదేవరకు సత్కారం



**తెనాలి:** మండల లీగల్ సర్వీస్ కమిటీ సభ్యునిగా నియమితులైన బొమ్మదేవర వెంకటేశ్వరరావును తెనాలి పట్టణ, పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం సోమవారం సత్కరించింది. సంఘ అధ్యక్షుడు దరిశి శివకోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. బొమ్మదేవర వెంకటేశ్వరరావు సంఘం ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. నూతనంగా మండల్ లీగల్ సర్వీస్ కమిటీ సభ్యత్వం లభించటంతో ఈ అభినందన సభను ఏర్పాటుచేశారు. సంఘ పాలకవర్గ సభ్యులు, ఎన్జీఓ, పెన్షనర్స్, తెనాలి శాఖ నాయకులు, మాజీ సైనిక సంఘం సభ్యులు బొమ్మదేవరను సత్కరించినవారిలో ఉన్నారు. సంఘ కోశాధికారి నారాయణం కమల్‌కుమార్, ఉపాధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి, ఆర్ఎస్ శంకర రావు, డీవీ సోమయ్యశాస్త్రి, మొవ్వ సత్యనారాయణ పాల్గొన్నారు.

# 19న అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ

**ముఖ్య అతిథిగా ఎంపీ తిరుమావళవన్**



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శంకరరావు, సురేంద్ర, కిరణ్ తదితరులు

**తెనాలిఅర్బన్:** అంబేడ్కర్ యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 19న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు, వైఎస్సార్ సీపీ 1వ వార్డు కౌన్సిలర్ గెడ్డేటి సురేంద్ర తెలిపారు. బస్టాండ్ సమీపంలోని సామ్రాట్ హోటల్‌లో సోమవారం సాయంత్రం విగ్రహావిష్కరణ వాల్ పోస్టర్లు, కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొల్లిపర గ్రామంలో సాయంత్రం 6 గంటలకు అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా తమిళనాడు వీసీకే పార్టీ జాతీయ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ తిరుమావళవన్ హాజరవుతారని చెప్పారు. అలాగే ఐతా నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి కొల్లిపర వరకు భారీ ర్యాలీ ఉంటుందని తెలిపారు. తెనాలి నియోజకవర్గ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ రాజకీయాలకతీతంగా అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. దళిత నాయకులు సోపాటి కిరణ్, అక్కిదాసు కిరణ్, డాక్టర్ అబ్రహం లింకన్ మాట్లాడుతూ బహుజనులలో ఐక్యతను తీసుకొచ్చేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో పిల్లి విజయ భాస్కర్, కంచర్ల అమృతరాజు, నక్కా సంసోను, డాక్టర్ కంచర్ల విజయ భాస్కర్, మండ్రు రాజు, పిల్లి గంగాధర్, ఆరె శేఖర రావు తదితరులు పాల్గొన్నారు.

### జీజీహెచ్‌లో రోగి మృతిపై ఫిర్యాదు



ఆర్ఎంఓ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రకాష్ తదితరులు

**గుంటూరు మెడికల్:** జీజీహెచ్‌లో శనివారం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స కోసం వచ్చిన బిళ్ల బాలరాజు వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ బత్తు వెంకటసతీష్‌కుమార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. జీజీహెచ్ క్యాజువాలిటీలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, జూనియర్ డాక్టర్లు వ్యాధి నిర్ధారణ పరీక్షల పేరుతో కాలయాపన చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల పేదలకు సకాలంలో చికిత్స అందక చనిపోతున్నారని ఆరోపించారు. సంఘటనపై విచారణ జరిపి సీనియర్ వైద్యులు క్యాజువాలిటీలో అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి శ్రీనివాస్, భీమ్ భా రత్ నేతలు దొడ్డా రాజేంద్రప్రసాద్, ఎస్.కె.బాజీ, ఎర్రగుంట్ల సుజాతారావు, బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాడికొండ నరసింహారావు ఉన్నారు.

# తాళం భజన పోటీలలో పెదపరిమి ప్రథమం

**తాడికొండ:** పల్నాడు జిల్లా రాజుపాలెం మండలంలో నిర్వహించిన తాళం భజన పోటీలలో తుళ్ళూరు మండలం పెదపరిమి శ్రీ సీతారామ భక్త సమాజం ప్రథమ స్థానంలో నిలిచింది. ఇప్పటి వరకు జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో తమ భక్త సమాజం 4 సార్లు పాల్గొంటే ఒక సారి ప్రథమ, రెండు సార్లు ద్వితీయ, ఒక సారి తృతీయ బహుమతులు సాధించినట్లు సభ్యులు తెలిపారు.